సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ

కాచిగూడ, జూన్ 28: కేంద్ర ప్రభుత్వ ఆమోదిత నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్ కోర్సుల్లో ఆన్‌లైన్‌లో శిక్షణకై తెలంగాణ వ్యాప్తంగా ఆసక్తి గల యువత నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విమలారెడ్డి తెలిపారు. కాచిగూడలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, సైబర్ సెక్యూరిటీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. సెక్యూరిటీ ఆర్కిటెక్ట్, ఐటీ సెక్యూరిటీ విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీర్, పాలిటెక్నిక్, డిప్లమా యువకులు జూలై 6వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు ఫోన్ నం. 78931 41797, ఆన్‌లైన్‌లో www.nacsindia.org లో సంప్రదించవచ్చని ఆమె కోరారు.

రాష్ట్రపతి నిలయంలో సైక్లోథాన్ ఆవిష్కరణ

బొల్లారం, జూన్ 28: పర్యావరణ పరిరక్షణ ఫెడల్ ఫర్ ద ప్లానెట్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 30న బొల్లారం రాష్ట్రపతి నిలయంలో సైక్లోథాన్ సైక్లింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్రపతి నిలయం అధికారులు రజినీ ప్రియ వెల్లడించారు. ఈ సందర్భంగా శుక్రవారం బొల్లారం రాష్ట్రపతి నిలయంలో అధికారులతో కలిసి రాష్ట్రపతి నిలయం సైక్లోథాన్ అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం, రజినీ ప్రియ మాట్లాడుతూ, ఈ నెల 30న రాష్ట్రపతి నిలయం నుంచి ఈసీఐఎల్ చౌరస్తా వరకు ఉదయం 6 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. రాష్ట్రపతి నిలయం యొక్క గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని జరుపుకుంటూ, స్థిరమైన పద్ధతులను ప్రోత్సహించడంలో పౌరులు చురుకుగా పాల్గొనడానికి సైక్లోథాన్ ఒక వేదికగా పనిచేస్తుందని తెలిపారు. గతేడాది మా దిరిగానే రాష్ట్రపతి నిలయం సందర్శకులకు అనుమతి ఉంటుందని తెలిపారు.

రైతాంగ సమస్యలపై ఉద్యమాలు చేస్తాం

కిసాన్ యూనియన్ (ఏ) రాష్ట్ర అధ్యక్షులు డీకే చంద్రశేఖర్ యాదవ్

ఖైరతాబాద్, జూన్ 28: తెలంగాణ రాష్ట్రంలోని రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమిస్తామని భారతీయ కిసాన్ యూనియన్(ఎ) రాష్ట్ర అధ్యక్షులు డీకే చంద్రశేఖర్ యాదవ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర నూతన అధ్యక్షులుగా నియమితులైన చంద్రశేఖర్ యాదవ్ శుక్రవారం సాయంత్రం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. దేశంలోని రైతులకు కనీస మద్దతు ధర, వ్యవసాయ రుణాలు, పంట బీమా తదితర సమస్యలపై తమ సంఘం అవిశ్రాంత పోరాటాలు చేస్తున్నదని, రాష్ట్రంలోనూ రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించాలన్న ఉద్దేశంతో తనను రాష్ట్ర అధ్యక్షులుగా నియమించారని తెలిపారు. తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా నియమించిన జాతీయ అధ్యక్షులు చౌదరి దిషాల్ అంబవత, సహకరించిన జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఎం ముస్తాక్ వాజిద్ అలీకి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రపంచ సవాళ్ల పరిష్కారమే లక్ష్యం

బ్రిటిష్ కౌన్సిల్ కమిషనర్ గరెత్ విన్ ఓవెన్

మాదాపూర్, జూన్ 28: ప్రపంచంలోని పలు సమస్యలపై చర్చించడానికి, వైవిధ్యం, సమగ్రతను ప్రోత్సహించడానికి నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులకు హఫీజ్‌పేట్‌లోని మేరు ఇంటర్ నేషనల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన మిస్ మూన్ 24 వేదికైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బ్రిటిష్ కౌన్సిల్ కమిషనర్ గరెత్ విన్ ఓవెన్ విచ్చేసిన పాఠశాల వ్యవస్థాపకురాలు గోరుకంటి జాపల్లి ప్రిన్సిపాల్ దౌత్యంతో కలిసి కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, అంతర్జాతీయ సమస్యలపై చర్చించి వాటి సమస్యకు పరిష్కారాన్ని మూపేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. ప్రపంచ సవాళ్లకు పరిష్కారాలను ప్రతిపాదించే లక్ష్యంతో ఉన్నట్లు చెప్పారు. విద్యార్థులు తమ ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేయాలని చెప్పారు. భవిష్యత్‌లో నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించడంపై దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నగరంలోని 40 పాఠశాలల నుంచి దాదాపు 300లకు పైగా విద్యార్థులు హాజరై జ్ఞానాన్ని పెంచుకున్నారు.

ఢిల్లీలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పీవీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీలు కేతీర్ సురేశ్ రెడ్డి, దీవకొండ దామోదర్ రావు, వద్దిరాజు రవిచంద్ర



నగరంలోని బీఆర్ఎస్ భవన్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ వాణీదేవి, చిత్రంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి, తదితరులు

జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

జాతి పండుగగా పీవీ జయంత్యుత్సవం

నెక్లెస్ రోడ్డులో ఘనంగా పీవీకి నివాళి • పుష్పాంజలి ఘటించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఇతర ప్రముఖులు

బేగంపేట్ జూన్ 28: దివంగత మాజీ ప్రధానమంత్రి పీవీ నర్సింహారావు 103 జయంతిని పురస్కరించుకొని నెక్లెస్ రోడ్డులోని పీవీ ఘాట్‌లో ఆయన సమాధి వద్ద శుక్రవారం పలువురు నివాళులర్పించారు. పీవీ నర్సింహారావు దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ప్రధానంగా తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్, ఐ అండ్ పీఆర్ కమిషనర్ హనుమంతరావు, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, కోదండ రాం, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, మాజీ మంత్రులు జానారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎంపీ హన్మంతరావు, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌తో పీవీ కుటుంబ సభ్యులు ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, పీవీ ప్రభాకర్‌రావులు పీవీ సమాధి వద్ద పుష్పాంజలి ఘటించారు.



నెక్లెస్ రోడ్డులోని పీవీ ఘాట్ వద్ద పీవీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తలసాని

అనంతరం, పీవీ ఘాట్‌లో సర్వమత ప్రార్థనలు, భజనలు, ఉచిత రక్తదాన శిబిరం, వైద్య శిబిరం, తాగునీటి శిబిరాలను పాటు ఏర్పాటు చేశారు.

పీవీ నర్సింహారావు బాటలోనే నడుస్తాం: మంత్రి కోమటిరెడ్డి

నేటి ఆర్థిక వ్యవస్థ ఇంత బలంగా ఉండటానికి మాజీ దివంగత ప్రధాని పీవీ నర్సింహారావు తీసుకువచ్చిన సంస్కరణలే కారణమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. భూ సంస్కరణలతో పేద, దళిత వర్గాల ప్రజలకు భూమిని పంచి వారు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేశారన్నారు. పీవీ బాటలనే తామంగా నడుస్తామన్నారు.

పీవీ ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచారు: ఎమ్మెల్యే తలసాని

దేశానికి ఎన్నో సేవలందించిన పీవీ నర్సింహారావు ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచారని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మారుమూల గ్రామం నుంచి వచ్చిన ఆయన ఎన్నో ఉన్నతమైన పదవులు అధిష్టించి దేశ ప్రధానిగా ఎన్నో ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడయ్యారని కొనియాడారు. పీవీ ఖ్యాతిని గుర్తించిన నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో కార్యక్రమాలు చేయడంతో పాటు భారతరత్న అందించాలని డిమాండ్ చేశారని గుర్తు చేశారు. అప్పటి పీవీ నిర్ణయాలతోనే ప్రస్తుతం పరిపాలన నడుస్తున్నదన్నారు. కార్యక్రమంలో బేగంపేట్ కార్పొరేటర్ మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నెక్లెస్ రోడ్డులోని పీవీ ఘాట్ వద్ద పీవీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పీవీ నర్సింహారావు కుటుంబ సభ్యులు

పీవీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్

బిల్డర్ల కంటే ఆర్కిటెక్చర్లదే కీలక పాత్ర

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మాదాపూర్, జూన్ 28: బిల్డర్లంటే ఆర్కిటెక్చర్లదే కీలకపాత్ర అని రోడ్లు, భవనాల (ఆర్ అండ్ బీ) శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఐఐఐడీ షో కేస్ ఇన్‌సైడర్ ఎక్స్ 5వ ఎడిషన్‌కు ముఖ్య అతిథిగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విచ్చేసి ఆర్ అండ్ బీ ప్రత్యేక అధికారి హరిచందనతో పాటు నిర్వాహకులు ఐఐఐడీ హెచ్చార్సీ చైర్ పర్సన్ పల్లవి, రాకేశ్ వాసులతో కలిసి శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. అనంతరం, ఐఐఐడీ షో కేస్ ఇన్‌సైడర్ బ్రోచర్‌ను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ, దేశంలోని మెట్రో పాలిటన్ నగరాల్లో హైదరాబాద్ అగ్రస్థానంలో ఉందన్నారు. సామాన్యుల ఆకాంక్షలను నిర్వహిస్తూనే మరోవైపు తమ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన పరిష్కారాల రూపకల్పనలో సహాయం చేయడంలో అగ్రగామిగా ఉండాలన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో ఆర్కిటెక్ట్‌లు, ఇంటీరియర్ డిజైనర్లు, డిజైన్ సంబంధిత ట్రేడ్ నిపుణులు, బిల్డర్లు, ప్రాజెక్ట్ మేనేజర్లు, ఎంఈపీ కన్సల్టెంట్లు, రక్షణ, ప్రభుత్వ, కార్పొరేట్ రంగాలకు చెందిన పరిశ్రమ స్పెసిఫికేషన్లు, హోం బిల్డర్లు ఉన్నారు.



గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ అనుదీప్, చిత్రంలో అధికారులు

వైద్యం, విద్యపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

గోల్కొండ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, స్కూల్‌ను సందర్శించిన కలెక్టర్

సిటీబ్యూరో, జూన్ 28(నమస్తే తెలంగాణ): గోల్కొండ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని 200 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు అవసరమయ్యే ప్రతిపాదనలు సమర్పించాలని జిల్లా వైద్యాధికారులను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. గోల్కొండలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. పిల్లల ఓపీ, డెంటల్ వార్డ్, ఐసీయూ, డయాలసిస్ సెంటర్, ఫార్మసీ స్టోర్, ఔట్ పేషెంట్ వార్డులను ఆయన పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న సేవల గురించి రోగులతో మాట్లాడారు. అనంతరం, అదే ప్రాంతంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాలను కూడా సందర్శించారు. విద్యార్థులు వంద శాతం హాజరయ్యేల ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. విద్యా, వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్, డీసీహెచ్ఎస్ డా.సునీత, ఆసుపత్రి సూపరింటిండెంట్ మజారుద్దీన్ పాల్గొన్నారు.

కోఠిలోని మెడికల్ కళాశాల ఆవరణలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

బోధన లేకనే పరీక్షల నిర్వహణతో ఫెయిలయ్యాం

ఓంసీ బీఎస్సీ అలైడ్ సైన్స్ హెల్త్ కోర్సుల విద్యార్థులు

సుల్తాన్ బజార్, జూన్ 28: సిలబస్‌ను రూపొందించక పోవడం, సరైన తరగతులు, బోధన లేకుండానే బీఎస్సీ అలైడ్ సైన్స్ హెల్త్ కోర్సుల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించడంతో ఫెయిల్ అయ్యామని ఉస్మానియా మెడికల్ కళాశాల బీఎస్సీ అలైడ్ సైన్స్ హెల్త్ కోర్సుల విద్యార్థులు వాపోయారు. ఈ మేరకు శుక్రవారం కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాల ఆవరణలో తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థులు అన్వేష్, గంగాదేవి ఈశ్వర్, సాయి, సుష్మలు మాట్లాడుతూ 2022-23 విద్యా సంవత్సరంలో నాటి బీ ఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో తొలిసారిగా ఎనిమిది కోర్సులతో బీఎస్సీ అలైడ్ సైన్స్ హెల్త్ కోర్సులను ప్రారంభించింది. కాగా, ఈ యేడాది పాటు సరైన సిలబస్ రూపొందించక పోవడం, ప్రొఫెసర్లతో కాకుండా పీజీలతో బోధనను కొనసాగించి, సరైన తరగతులు నిర్వహించకపోవడంతో పాటు ఒకే యేడాదిలో ఎనిమిది సబ్జెక్టులకు కాళోజి హెల్త్ యూనివర్సిటీ పరీక్షలు నిర్వహించగా, ఈ పరీక్షలలో రాష్ట్ర వ్యాప్తంగా 860 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. కాగా కేవలం 16 మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణతను సాధించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యేడాది పరీక్షలను నిర్వహించే నాటికి సిలబస్ పూర్తి కాలేదని తెలిపినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్ గౌడ్

టీపీసీసీ పదవికి బీసీలు అర్హులు కాదా?

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్

ఖైరతాబాద్, జూన్ 28: రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకే టీపీసీసీ పదవీ కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ, ప్రభుత్వపరమైన పదవులు, పార్టీ పోస్టుల భర్తీ గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రివర్గం, ఢిల్లీలో నాలుగు రోజులుగా మకాం వేసిందని, కాంగ్రెస్ అధిష్టానంతో కలిసి కసరత్తు చేస్తుందని, ఈ సారి టీపీసీసీ పదవీ బీసీలకే ఇవ్వాలని, రాష్ట్రంలోని యావత్ బీసీల తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. జెండాలు మోసే కాడ బీసీలు కావాలి, పదువులు మాత్రం ఆ వర్గాలకు దక్కడం లేదన్నారు. న్యాయబద్ధంగా, ధర్మబద్ధంగా 60 శాతం ఉన్న బీసీలు టీపీసీసీ పదవికి అర్హులు కాదా? అని ప్రశ్నించారు. తాము బిచ్చం అడుక్కోవడం లేదని, రాష్ట్ర జనాభాలో అత్యధిక శాతం ఉన్న తమకు ఆ పదవడిగే హక్కు ఉందన్నారు. సమావేశంలో కుందారం గణేశ్, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, మణిమంజరి సాగర్, పండుగ బాలు ముదిరాజ్ పాల్గొన్నారు.

అన్ లిమిటెడ్ స్టోర్‌లలో రెడ్ అలర్ట్ సేల్ ఆఫర్..

- తాజా కలెక్షన్లలో ఫ్లాట్ 50 శాతం తగ్గింపు

జూబ్లీహిల్స్, జూన్ 28: ఫ్యాషన్ ప్రియుల అభిరుచులకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అన్‌లిమిటెడ్ స్టోర్లలో రెడ్ అలర్ట్ సేల్ ఆఫర్ అందిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. గత రెండు వారాలుగా అందిస్తున్న ఈ ఆఫర్‌ను వినియోగదారుల నుంచి వచ్చిన విశేష ఆదరణతో మరికొన్ని రోజులు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. పురుషులు, మహిళలు, పిల్లలకు విస్తృత శ్రేణి ఉత్పత్తులతో దేశంలోని అన్ని స్టోర్లలో రెడ్ అలర్ట్ సేల్ ఆఫర్ అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఎంపిక చేసిన తాజా కలెక్షన్లలో ఫ్లాట్ 50 శాతం తగ్గింపు అందిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో పాటు క్లాసిక్ పోలో, క్రోకొడైల్, క్రిమ్‌సన్ క్లబ్, రిక్ రోగ్, ట్విల్స్ బ్రాండ్లలో రూ.3 వేల షాపింగ్‌పై రూ.3 వేల ఉచిత షాపింగ్ ఆఫర్‌ను అందిస్తున్నట్లు తెలిపారు.

బోనాల పండుగకు విద్యుత్ ఏర్పాట్లు

సర్కిల్ అధికారులతో విద్యుత్ శాఖ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ సమీక్ష

సిటీబ్యూరో, జూన్ 28(నమస్తే తెలంగాణ): ఆషాఢ మాసం బోనాల పండుగ నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్‌లో నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ ముషారప్ ఫరూఖీ తెలిపారు. ఖైరతాబాద్‌లోని కార్పొరేట్ కార్యాలయంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు నంద కుమార్, డాక్టర్ నర్సింహులు, చీఫ్ ఇంజనీర్లు కె.సాయిబాబా, ఎల్.పాండ్య, వి.శివాజీ, పి.బిక్షపతి, పి.ఆనంద్, సీజీఎం కృష్ణారెడ్డి, సూపరింటెండింగ్ ఇంజనీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం, ఉన్నతాధికారులకు సీఎండీ ప్రత్యేకంగా పలు సూచనలు చేశారు.

- బోనాల పండుగకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పండుగ ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని, జూలై 2 నాటికి సంబంధిత సీఈలు, ఎస్ఈలు పండుగ కంటే ఒక రోజు ముందు ఆలయాలు, వాటి ప్రాంగణాలను సందర్శించి 24/7 విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలి.
- ప్రతి దేవాలయానికి నోడల్ అధికారి లేదా ఏఈని కేటాయించాలి.
- ఆర్ అండ్ బీ డిపార్టుమెంట్, ఆలయ కమిటీలతో సమన్వయం చేసుకొని, డీటీఆర్‌లు, నెట్‌వర్క్‌లలో ఏర్పాటు చేసిన అదనపు తాత్కాలిక లైట్లు, ఎయిర్ కండీషనింగ్, సౌండ్ సిస్టమ్‌లను అనుసంధానం చేయడానికి సజావుగా ఉండేలా చూసుకోవాలి.
- నిరంతర విద్యుత్ సరఫరాను అందిస్తూ, ప్రమాద రహితంగా బోనాల పండుగ జరుపుకునే 24 గంటల పాటు విధులు నిర్వహించాలి.
- అవసరమైన చోట ప్రత్యామ్నాయ సామగ్రిని ఏర్పాటు చేయాలి. క్షేత్ర స్థాయి సిబ్బందికి తగిన సామగ్రిని అందుబాటులో ఉంచడంతో పాటు ఏవైనా ఘటనలు ఎదుర్కొనేలా ఉండాలి.

నగరంలో బోనాల పండుగకు విద్యుత్ శాఖ ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

ఏబీవీపీ కార్యకర్తలను అరెస్టు చేస్తున్న పోలీసులు

మౌలిక వసతులు కల్పించాలి.. అధిక ఫీజులను నియంత్రించాలి

ఖైరతాబాద్, జూన్ 28: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో వసూలు చేస్తున్న అధిక ఫీజులను నియంత్రించాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో లక్డీకాపూల్‌లోని విద్యాశాఖ కమిషనర్ కార్యాలయాన్ని శుక్రవారం ముట్టడించారు. విద్యార్థులు పెద్ద ఎత్తున కమిషనరేట్‌లోకి దూసుకెళ్లడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు విద్యార్థులను అడ్డుకొని అరెస్టు చేశారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శులు ఝాన్సీ, కమల్ సురేశ్‌లు మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రైవేట్, కార్పొరేట్, ఇంటర్నేషనల్ పేరుతో వెలిసిన విద్యా సంస్థలలో లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నా, ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఆయా పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫామ్స్ ఇష్టారాజ్యంగా అమ్ముకుంటున్నారని, వారిపై అధికారుల నియంత్రణ కొరవడిందన్నారు. సర్కారు బడుల్లో మధ్యాహ్న భోజనాలు, హాస్టళ్లలో కల్తీ ఆహారం పెట్టి విద్యార్థులను అనారోగ్యాల పాలు చేస్తున్నారని విమర్శించారు. ఎంఈవో, డీఈవోతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని, నియామకాలు ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. మెగా డీఎస్సీ ద్వారా 24 వేల పైగా ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయాలని, అటెండర్, స్కావెంజర్లను నియమించాలన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం, ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించాలన్నారు. తక్షణమే విద్యారంగ సమస్యలను తీర్చకుంటే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నైటింగేల్ నర్సింగ్ కాలేజీపై చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన హైకోర్టు అడ్వకేట్, బీఆర్ఎస్ నాయకులు

సుల్తాన్‌బజార్, జూన్ 28: నర్సింగ్ విద్యార్థినుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న నైటింగేల్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకొని విద్యార్థినులకు న్యాయం చేయాలని హైకోర్టు అడ్వకేట్, బీఆర్ఎస్ నాయకులు ఎం.వెంకటేశ్ గుణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోఠిలోని తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్ కార్యాలయం ముందు నర్సింగ్ విద్యార్థినులతో కలిసి ఆయన నిరసన తెలిపారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ, 2023-24 విద్యా సంవత్సరానికి 35 మంది విద్యార్థులను చేర్చుకున్న కళాశాలలో ఒక ఫ్యాకల్టీ, సిబ్బంది లేక పోవడం ఆశ్చర్యానికి గురి చేస్తుందని మండిపడ్డారు. ఈ విషయాన్ని ఆలస్యంగా అర్థం చేసుకున్న విద్యార్థినులు రెండు నెలలుగా తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తనను ఎవరూ ఏమి చేయలేరని విద్యార్థినులను బెదిరిస్తుండటంతో చేసేది లేక విద్యార్థినులు అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో కళాశాల ప్రిన్సిపాల్‌కు కౌన్సిల్‌కు హాజరు కావాలని నోటీసులను ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ప్రభుత్వం విద్యార్థినుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నర్సింగ్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకొని విద్యార్థినులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

కోఠిలోని టీఎస్ఎంసీ ముందు నిరసన తెలుపుతున్న హై కోర్టు అడ్వకేట్, బీఆర్ఎస్ నాయకులు ఎం.వెంకటేశ్ గుణ

డయల్ యువర్ ఎండీ

సిటీబ్యూరో, జూన్ 28(నమస్తే తెలంగాణ): జల మండలిలో శనివారం (నేడు) సాయంత్రం 5 గంటల నుంచి 5.30 గంటల వరకు డయల్ యువర్ ఎండీ కార్యక్రమం జరుగుతుందని అధికారులు తెలిపారు. ఎండీ అశోక్ రెడ్డి వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదుల్ని స్వయంగా స్వీకరించనున్నారు. వివిధ డివిజన్, సర్కిల్ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న మంచినీటి సరఫరా, సీవరేజి, మీటర్, బిల్లింగ్, నల్లా కనెక్షన్, రెవెన్యూ ఇతర అంశాలకు సంబంధించిన సమస్యల్ని వినియోగదారులు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. ఫోన్ నం. 040-2344 2881, 2344 2882, 2344 2883కు కాల్ చేసి తమ క్యాన్ నం. గాని, ఇంటి నంబర్, మొబైల్ నంబర్లను చెప్పాల్సి ఉంటుందన్నారు. డయల్ యువర్ ఎండీ కార్యక్రమం జరిగే సమయంలో బోర్డు డైరెక్టర్లు సహా అన్ని సర్కిల్, డివిజన్ ఉన్నతాధికారులు ఉంటారని, వినియోగదారులు చెప్పే సమస్యల్ని సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తారని చెప్పారు.

అడ్డగుట్ట చౌరస్తాలో ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

కేంద్రం బొగ్గు గనుల ప్రైవేటీకరణను ఆపాలి

సీపీఎం డిమాండ్

అడ్డగుట్ట, జూన్ 28: కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల ప్రైవేటీకరణను ఆపి, బొగ్గు గనులను సింగరేణి కార్మిక యజమాన్యానికి కేటాయించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. అడ్డగుట్ట చౌరస్తాలో సీపీఎం సికింద్రాబాద్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ జోన్ కన్వీనర్ అజయ్ బాబు మాట్లాడుతూ, మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం వేలం వేస్తుందని, సింగరేణి కంపెనీ కూడా ప్రైవేట్ సంస్థలతో కలిసి వేలం పాటలో పోటీ పడాలని నిర్ణయించిందన్నారు. బొగ్గు గనుల శాఖ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హైదరాబాద్ కేంద్రంగా వేలం పాట ప్రక్రియను ప్రారంభించడం అన్యాయమన్నారు. క్రమంగా సింగరేణిని బలహీనపరచాలని మోడీ ప్రభుత్వం చూస